teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

తీన్మార్

నేటి వాస్తవాలు ... తెలుగు దిన పత్రిక

పెన్షన్ పొందడం రిటైర్డు ఉద్యోగుల హక్కు :హైకోర్టు

2 లో..

రిటైర్డ్ ఉద్యోగులకు 2 వారాల్లో పెన్షన్ బకాయిలను చెల్లించాలి

చివరి దశలో ఉన్న పెన్షనర్లకు 6 శాతం వడ్డీని చెల్లించాలి

ములుగు | సంపుటి : 03 | సంచిక : 369 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 13 మే 2024 | పేజీలు : 08 | వెల ₹ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

ధాన్యం తడిచిపోతే ఆందోళన వద్దు

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ సీఎం రేవంత్ సూచనలు

అకాల వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆరా

అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశాలు

తెలంగాణలో వర్షాలు, గాలివాన, పిడుగు పాటుతో సంభవించిన నష్టంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాల పరిధిలో వర్షం బీభత్సం సృష్టించింది. మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్, మే 12 (తీన్మార్ న్యూస్):ఆదిలాబాద్ జిల్లా గిమ్మలో పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోతే, రైతులు ఆందోళన చెందవద్దని సీఎం హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖ ల అధికారులు, సిబ్బంది తగిన సహాయక

మిగతా 2 లో

ఓటు వేయడానికి 13 రకాల గుర్తింపు కార్డులకు అనుమతి

ఏదైనా చూపించి ఓటు వేసే అవకాశం

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

స్వతంత్ర భారతంలో ఓ చరిత్రాత్మకమైన ఘట్టం ముందు మనం నిలిచివున్నాం. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో కీలక ఎన్నికలకు సిద్ధమయ్యాం. రెండు రాష్ట్రాల్లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. అదే సమయంలో అర్బన్ ఓటింగ్ ఎలా జరుగుతుంది అనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. అన్నిటికీ మించి యువతను ఓటింగ్ ప్రక్రియలో ఎలా భాగస్వాములను చేయాలి అనే చర్చ జరుగుతోంది.

హైదరాబాద్, మే 12 (తీన్మార్ న్యూస్): తెలుగు నాట మరికొద్ది గంటల్లో పోలింగ్ జరుగుతున్న తరుణంలో.. ఓటర్లలో చైతన్యం నింపే ప్రయత్నంలో ఉన్నారు ఎన్నికల అధికారులు. తెలుగు రాష్ట్రాల్లో సోమవారం ఎన్నికల హడావిడి ఎక్కువగా ఉండనుంది. ఓటర్లు అందరూ

మిగతా 2 లో

హైదరాబాద్‌లో మరో 12 గంటలు వైన్ షాపులు బంద్

మద్యం ప్రియులకు హైదరాబాద్ పోలీసులు బిగ్ షాక్

హైదరాబాద్, మే 12 (తీన్మార్ న్యూస్): మద్యం ప్రియులకు హైదరాబాద్ పోలీసులు బిగ్ షాకిచ్చారు. హైదరాబాద్ లో మరో 12 గంటలు వైన్ షాపులు బంద్ కానున్నాయి ఈ విషయాన్ని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మే 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి మద్యం దుకాణాలు

మిగతా 2 లో

మే11తో ముగిసిన టీఎస్ ఎప్సెట్ పరీక్షలు

మే 25న ఎప్సెట్ ఫలితాలు విడుదలయ్యే అవకాశం

తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 7న ప్రారంభమైన టీఎస్ ఎప్సెట్ పరీక్షలు మే 11తో ముగిశాయి. ఇందులో మే 7, 8 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు, మే 9 - 11 వరకు ఇంజినీరింగ్ విభాగానికి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 5 రోజులపాటు నిర్వహించిన పరీక్షలకు 3.5 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 3.32 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు.

హైదరాబాద్, మే 12 (తీన్మార్ న్యూస్): మొత్తంగా 94 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు నిర్వహించిన ఈ పరీక్షలకు రెండురోజుల్లోనూ 90 శాతానికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల తొలిరోజైన మే 7న మొదటి సెషన్కు 90.41 శాతం మంది, రెండో సెషన్కు 91.24 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 33,500 మందికి గాను 30,288 మంది మొదటి సెషన్లోబీ 33,505 మందికి గాను 30,571 మంది రెండో సెషన్లో పరీక్ష రాశారు. ఇక మే 8న నిర్వహించిన పరీక్షకు 91.67% అభ్యర్థులు పరీక్షకు

మిగతా 2 లో

బీజేపీ పార్టీపై యుద్ధానికి సిద్ధమైన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

లోక్ సభ ఎన్నికల్లో 10 గ్యారెంటీలతో మేనిఫెస్టో విడుదల

న్యూ ఢిల్లీ, మే 12 (తీన్మార్ న్యూస్): లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ పార్టీపై యుద్ధానికి సిద్ధం అయ్యారు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్. ఇటీవల లిక్కర్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్ పై విడుదలైన ఆయన శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీపై, మోదీపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈరోజు మరోసారి మీడియా ముందుకు వచ్చిన ఆయన లోక్ సభ ఎన్నికల్లో 10 గ్యారెంటీలతో ఉన్న మేనిఫెస్టోను విడుదల చేశారు. దేశంలో 24 గంటల ఉచిత కరెంటు, ఉచిత విద్య, చైనా నుంచి భూమిని స్వాధీనం చేసుకోవడం, ఢిల్లీకి రాష్ట్ర హోదా తదితర అంశాలు 10 హామీల్లో ఉన్నాయి. సీఎం కేజ్రీవాల్ మాట్లాడుతూ ఈ రోజు మనం లోక్‌సభ ఎన్నికలు 2024 కోసం 10 హామీలను

మిగతా 2 లో

అంబేద్కర్ వారసురాలిగా వస్తున్నా.. ఆశీర్వదించండి

వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

మామునూర్‌లో విమానం ఎగిరిస్తాం

మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి చేస్తం

ముచ్చట చెప్పట్లే సీఎం రేవంత్ రెడ్డి సైతం మాటిచ్చిండు

తాను అంబేద్కర్ వారసురాలిగా వస్తున్నానని, తనను భారీ మెజార్టీతో ఆశీర్వదించాలని వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య ప్రజలను కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి రాబోతున్నదని, ఎంపీగా తనను గెలిపిస్తే కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధిస్తానని తెలిపారు. గ్రేటర్ వరంగల్ సిటీలో ఏండ్ల తరబడి కలగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు.

వరంగల్, మే 12 (తీన్మార్ న్యూస్) దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కాజీపేటకు రెండుసార్లు కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేసినా వివిధ కారణాల వల్ల పనులు కాలేదన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో విభజన చట్టంలోనూ కోచ్ ఫ్యాక్టరీని పొందుపరిచామని చెప్పారు. ఈ క్రమంలో దేశంలో బీజేపీ, రాష్ట్రంలో

మిగతా 2 లో

సార్వత్రిక ఎన్నికల వేళ సంక్రాంతి రికార్డును టీఎస్ఆర్టీసీ బ్రేక్

ఈ నెల 9 నుంచి 11 వరకు 1.42 లక్షల మంది ప్రయాణం చారని వెల్లడి

హైదరాబాద్, మే 12 (తీన్మార్ న్యూస్): సార్వత్రిక ఎన్నికల వేళ సంక్రాంతి రికార్డును టీఎస్ఆర్టీసీ బ్రేక్ చేసింది. సంక్రాంతి సీజన్‌తో పోలిస్తే 10 శాతానికి పైగా ప్రయాణికులు ఆర్టీసీని వినియోగించుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 1.42 లక్షల మంది ప్రయాణించారని

మిగతా 2 లో

పోలింగ్ సంబంధించిన అధికారులపై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు

ఐపీసీ సెక్షన్ 134 ఆర్పీ ప్రకారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చర్యలకు సిద్ధం



నల్గొండ, మే 12 (తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండగా ఎన్నికలకు సంబంధించిన సామాగ్రి పోలింగ్ సెంటర్లలోకి కూడా చేరుకుంది. కానీ నల్లగొండ జిల్లా దేవరకొండ

మిగతా 2 లో

హైదరాబాద్ లో మరో 12 గంటలు వైన్ షాపులు బంద్

మొదటి పేజీ తరువాయి

క్లోజ్ అయ్యాయి. పోలింగ్ జరిగే మే 13వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయి. పోలింగ్ ముగిసిన తర్వాత తిరిగి ఓపెన్ అవుతాయి. అయితే హైదరాబాద్ లో మాత్రం మరో 12 గంటలు లిక్కర్ షాపులు, బార్లు, హోటల్స్, క్లబ్స్,అన్ని రకాల లిక్కర్ షాపులు బంద్ కానున్నాయి. ఈ మేరకు పోలీసులు ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి మే 14 తేదీ ఉదయం 6 గంటల వరకు వైన్ షాపులు ఓపెన్ అవుతాయి. మరోవైపు ఎన్నికల ఫలితాల రోజు వచ్చే నెల జూన్ 4వ తేదీన కూడా వైన్ షాపులు బంద్ కానున్నాయి. ఈసీ ఆదేశాలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ చేసి అమ్మితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

మే 11తో ముగిసిన టీఎస్ ఎప్సెట్ పరీక్షలు

మొదటి పేజీ తరువాయి

హాజరయ్యారు. మొత్తం 33,427 మందికిగాను 30,641 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తంగా ఫార్మసీ విభాగం పరీక్షలకు 1,00,432 మంది దరఖాస్తు చేసుకోగా.. 91,500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక రాష్ట్రంలో ఈఏపీసెట్-2024 ఇంజినీరింగ్ పరీక్షలు మే 9న ప్రారంభమైన సంగతి తెలిసిందే. మే 11తో పరీక్షలు ముగిశాయి. పరీక్షల మొదటిరోజు ఉదయం విడతకు 50,978 మందికిగాను 48,076 (94.3 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇక 2,902 (5.7 శాతం) మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం విడతకు 50,983 మందికిగాను 48,152 (94.4 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. 2,831 (5.6 శాతం) మంది గైర్హాజరయ్యారు. ఇక పరీక్షల రెండో రోజు 50,990 మందికిగాను.. 48,097 (94.3 శాతం) మంది మధ్యాహ్నం విడతలో 50,987 మందికిగాను 48,318 (94.8 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా ఇంజినీరింగ్ విభాగానికి మొత్తం 2,54,750 మంది దరఖాస్తు చేయగా వారిలో 2,40,617 మంది పరీక్షలు రాశారు.

మే 25న ఫలితాల వెల్లడి

ఎప్సెట్ ఫలితాలు మే 25న విడుదలయ్యే అవకాశం ఉంది. ఒకవేళ మే 25న కుదరకపోతే మే 27న ఫలితాలు విడుదల చేసేందుకు జేఎన్టీయూ అధికారుల సన్నాహకాలు చేస్తున్నారు.

అగ్రి, ఫార్మా ప్రిలిమినరి 'కీ' విడుదల

తెలంగాణలో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 7, 8 తేదీల్లో నిర్వహించిన ఎప్సెట్ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక ఆన్సర్ 'కీ'ని జేఎన్టీయూహెచ్ మే 11న విడుదల చేసింది. ఈ మేరకు ఈఏపీసెట్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షల ప్రిలిమినరి కీ విడుదలచేసినట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఒక ప్రకటనలో తెలిపింది. అధికారిక వెబ్సైట్లో ఆన్సర్ కీని అందుబాటులో ఉంచింది.

బీజేపీ పార్టీపై యుద్ధానికి సిద్ధమైన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

మొదటి పేజీ తరువాయి

ప్రకటించబోతున్నాం. నా అరెస్ట్ కారణంగా ఇది ఆలస్యమైంది, అయితే ఇంకా చాలా దశల ఎన్నికలు మిగిలి ఉన్నాయి. నేను ఇండియా కూటమితో దీని గురించి చర్చించలేదు కానీ ఇది ఎవరికీ ఎటువంటి సమస్యలు ఉండదనే హామీ లాంటిది. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలను అమలు చేసేలా చూస్తానని హామీ ఇస్తున్న అని అన్నారు. నేడు మన దేశంలో మన ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి బాగా లేదు. మా మూడవ హామీ మెరుగైన ఆరోగ్య సంరక్షణ. అందరికీ మంచి వైద్యం అందిస్తాం. ప్రతి గ్రామంలో, ప్రతి ప్రాంతంలో మొహల్లా క్లినిక్‌లు తెరవబడతాయి. జిల్లా ఆసుపత్రిని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా మారుస్తాం. ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందుతుంది. మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. వైద్యం కోసం 5 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తాము అని వ్యాఖ్యానించారు.

సార్వత్రిక ఎన్నికల వేళ సంక్రాంతి రికార్డును టీఎస్ఆర్టీసీ బ్రేక్

మొదటి పేజీ తరువాయి

టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. ఇక ఏపీకి 59,800 మంది ప్రయాణించారని తెలిపారు. కాగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఏపీ వైపునకు ఇప్పటివరకు 590 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయగా తాజాగా హైదరాబాద్-విజయవాడ రూట్‌లో 140 సర్వీసులను ఆన్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ కోసం పెట్టింది. ఆయా బస్సుల్లో దాదాపు 3 వేలకుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. టికెట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం https://tsrtconline.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టీఎస్ఆర్టీసీ కోరింది. అలాగే, హైదరాబాద్ నుంచి జిల్లాలకు 1500 ప్రత్యేక బస్సులను టీఎస్ఆర్టీసీ నడుపుతోంది. జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులను తిప్పుతోంది. ప్రయాణికుల రద్దీని బట్టి ఎప్పటికప్పుడు బస్సులను అందుబాటులో ఉంచాలని క్షేత్రస్థాయి అధికారులను యాజమాన్యం ఆదేశించింది. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా సొంతూళ్లకు వెళ్లి తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రయాణికులను ఈ సందర్భంగా టీఎస్ఆర్టీసీ యాజమాన్యం కోరింది.

పోలింగ్ సంబంధించిన అధికారులపై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ అధికారులు, అథర్ పోలింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు 48 మంది రిపోర్ట్ చేయాల్సి ఉండగా ఇంత వరకు రిపోర్ట్ చేయలేదు, విధులకు హాజరు కాలేదు. కావున వారి మీద దేవరకొండ అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి.శ్రీనివాసులు దేవరకొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వారి మీద ఐపీసీ సెక్షన్ 134 ఆర్పీ ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనతో నల్లగొండ జిల్లా ప్రజలు ముక్కున వేలు వేసుకున్నారు. గత కొన్ని రోజులుగా మొదటి నుంచి నల్లగొండ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి దాసరి హరి చందన అధికారులు విధులకు హాజరు కావాలి అని శిక్షణ తరగతులు కూడా ఏర్పాటు చేశారు. అయిన వారు విధులకు హాజరు కాకపోవడంతో పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వారి మీద ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఈ విషయమై జిల్లా ఎస్పీ చందన దీప్తి వారి మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెన్షన్ పొందడం రిటైర్డు ఉద్యోగుల హక్కు:హైకోర్టు

హైదరాబాద్, మే 12 (తీన్మార్ న్యూస్): పెన్షన్ పొందడం రిటైర్డు ఉద్యోగుల హక్కేగాని, కానుక కాదని హైకోర్టు వెల్లడించింది. తెలుగు అకాడమీ విభజన తర్వాత ఏపీ, తెలంగాణకు కేటాయించిన ఉద్యోగుల సర్వీసు రికార్డులను పరస్పరం తీసుకుని రిటైర్డ్ ఉద్యోగులకు 2 వారాల్లోగా పెన్షన్ బకాయిలను చెల్లించాలని స్పష్టం చేసింది. చివరి దశలో ఉన్న పెన్షనర్లకు 6 శాతం వడ్డీని చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వుల అమలుపై నివేదిక ఇవ్వాలని రెండు తెలుగు రాష్ట్రాలకు తెలిపింది. విచారణను జూన్ 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఉమ్మడి ఏపీలోని తెలుగు అకాడమీ 2022 మే 1న విభజన జరగ్గా అందులోని రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం లేదని బి.వరలక్ష్మీతో సహా ఏపీ, తెలంగాణకు చెందిన 15 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఎన్ని వినతి పత్రాలు సమర్పించినా తమకు పెన్షన్ ఇవ్వడం లేదని తమ పిటిషన్ లో పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పెన్షన్ అన్నది కానుక కాదని, సుప్రీం కోర్టు వెలువరించిన పలు తీర్పుల ప్రకారం ఇది ఆస్తి హక్కు వంటిదేనని తెలిపింది.

ధాన్యం తడిచిపోతే ఆందోళన వద్దు

మొదటి పేజీ తరువాయి

చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రానికి ఇవాళ, రేపు భారీ వర్షసూచన చేసింది వాతావరణశాఖ. సోమవారం హైదరాబాద్ లో భారీ వర్షాలుంటాయని చెప్పింది. ఉపరితలఆవర్తనం కారణంగా మోస్తరు వర్షాలు కురుస్తాయని అలెర్ట్ ఇచ్చింది. దీంతో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని మోహరింపజేసింది. సోమవారం ఎలక్షన్స్ ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది జీహెచ్ఎంసీ.

పంద్రాగస్టు కల్లా రుణమాఫీ చేస్తామని ప్రకటిస్తాం : సీఎం

హరీశ్ రాజీనామాను జేబులో పెట్టుకోవాలని రేవంత్ విమర్శలు

హైదరాబాద్, మే 12 (తీన్మార్ న్యూస్): ప్రధాని మోదీపై విమర్శలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. చెప్పిన అబద్ధాన్నే మోదీ మళ్లీ చెబుతున్నారని ఫైర్ అయ్యారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. దేవుడు గుడిలో ఉండాలి భక్తి గుండెల్లో ఉండాలని అన్నారు. బీజేపీ అభ్యర్థికి అహంకారం ఎక్కువని ఫైర్ అయ్యారు. రైతు కష్టమేమిటో జీవన్ రెడ్డికి తెలుసన్నారు. ఆర్మూర్ లో సీఎం రేవంత్ రెడ్డి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటపటిమ ఉన్నవాళ్లు ఆర్మూర్ రైతులని అన్నారు. 69 లక్షల మంది రైతులకు రైతుభరోసా ఇచ్చామని తెలిపారు. పంద్రాగస్టు కల్లా రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. హరీశ్ రాజీనామాను జేబులో పెట్టుకోవాలని సిద్ధిపేటకు ఆయన పీడను వదిలిస్తానని చెప్పారు. నల్లా చట్టాలపై మోదీ మెడలు వంచిన చరిత్ర రైతులదని అన్నారు. కోడ్ ముగిసిన వెంటనే చక్కెర రైతులను ఆదుకుంటామని చెప్పారు. కేసీఆర్ సవాళ్ల పైన నిలబడే వ్యక్తేనా అని ప్రశ్నించారు. అమరవీరుల స్థూపం కాడ కేసీఆర్ ముక్కు నేలకు రాయాలని అన్నారు. ఆర్మూర్ కు మున్సిపల్ కార్యాలయానికి రూ, 16 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఒక్క అవకాశం జీవన్ రెడ్డికి ఇవ్వండని కోరారు. పసుపు బోర్డు రావాలంటే కాంగ్రెస్ గెలవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

అకాల వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆరా

అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశాలు

ఇబ్బందులు తలెత్తకుండా సహాయక చర్యలకు సూచనలు

తెలంగాణ బ్యూరో, మే 12 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచన చేసినందునా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణం సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాల పరిధిలో గాలి వాన, పిడుగులతో బీభత్సం సృష్టించింది. ఐకేపీ సెంటర్ వద్ద మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం రామోజీపల్లి గ్రామానికి చెందిన తాత మనువడు పిడుగుపాటుకు మృతి చెందగా ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో పిడుగుపడి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలపై విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చనిపోయిన బాధితుల కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి తగిన వైద్య సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోతే రైతులు ఆందోళన చెందవద్దని సీఎం హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద గాలివాన బీభత్సం: రాష్ట్రంలోని పలు జిల్లాలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో ధాన్యం తడిచిపోయింది. వానతో పాటు ఈదురు గాలుల కారణంగా ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బంది అవస్థలు పడ్డారు. జహీరాబాద్, కామారెడ్డి, ఆసిఫాబాద్ తో పాటు మరికొన్ని చోట్ల ఏర్పాట్లు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద ఏర్పాటు చేసిన టెంట్ల నుంచి వర్షం నీరు కారడం, టెంట్లు కూలడంతో ఎన్నికల సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. ఈవీఎం మెషీన్లు, కంట్రోలింగ్ యూనిట్లు, ఈవీఎం ప్యాడ్లు తడవకుండా కాపాడుకునేందుకు సిబ్బంది నానా తంటాలు పడ్డారు. ఆసిఫాబాద్ లో ఎలాగోలా వర్షంలోనే ఎన్నికల సామగ్రితో సిబ్బంది పోలింగ్ బూత్ లకు బయలుదేరారు. వర్షాల కారణంగా సమస్యాత్మక కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది వెళ్లడం ఇబ్బందిగా మారింది.

నేటి పోలింగ్ కు రెయిన్ ఫియర్:

రాష్ట్రంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభం కాబోతుండగా మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో రేపటి పోలింగ్ పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. పోలింగ్ జరుగుతున్న సమయంలో వర్షం కురిస్తే ఓటర్లు తమ ఓటు హక్కు ఎలా వినియోగించుకుంటారనే సందేహం వ్యక్తం అవుతోంది. మరో వైపు వర్షం కారణంగా పోలింగ్ పర్సంటేజ్ తగ్గితే ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అనే ఆందోళన అభ్యర్థుల్లో వ్యక్తం అవుతోంది.

మే 13వ వేతనంతో కూడిన సెలవు ఇవ్వకపోతే కఠిన చర్యలు

ప్రయివేట్ కంపెనీలకు ఈసీ ఆదేశాలు జారీ

తెలంగాణ బ్యూరో, మే 12 (తీన్మార్ న్యూస్): రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల సమరం కీలక ఘట్టానికి చేరుకుంది. ఆదివారంతో ప్రచార పర్వం ముగియగా మే 13వ (సోమవారం) తేదీన కీలక ఘట్టమైన పోలింగ్ జరగనుంది. అయితే ఉద్యోగరిత్యా చాలా మంది హైదరాబాద్‌లో నివాసముంటున్న విషయం తెలిసిందే. కాగా మే 13న పోలింగ్‌లో పాల్గొనేందుకు చాలా మంది ఇప్పటికే గ్రామాలకు బయలుదేరారు. అయితే కొందరు ఉద్యోగులు మాత్రం కంపెనీల్లో సెలవులు దొరక్కో ఆరోజు సెలవు పెడితే జీతం కట్ అవుతుందన్న భయంతోనో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెళ్లకుండా ఉండిపోతున్నారు. అలాంటి ఉద్యోగులను పరిగణలోకి తీసుకుని ఎన్నికల సంఘం ఇప్పటికే కీలక ఆదేశాలు జారీ చేసింది.

ఓటు వేయడానికి 13 రకాల గుర్తింపు కార్డులకు అనుమతి

మొదటి పేజీ తరువాయి

వారి ఓటు హక్కును రేపు వినియోగించుకోనున్నారు. ఓటు వేయాంటే ఓటర్ కార్డు లేదా ఓటర్ స్లిప్ వంటివి ఉండాలి. ఇప్పటికే ఓటర్లకు ఈ ఓటర్ స్లిప్స్ అంది ఉంటాయి. ఒక వేళ ఇవి లేకపోతే.. ఏం చేయాలి.. ఓటు వేయవచ్చా.. లేదా.. వంటి అంశాలను మనం ఇప్పుడు ఒకసారి తెలుసుకుందాం. ఎన్నికల సంఘం ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఓటర్ ఐడీ లేకపోతే ఏం చేయాలి.. వంటి అంశాలు ఇప్పుడు తెలుసుకుందాం. ఒకవేళ ఈ ఐడెంటిటీ డాక్యుమెంట్ కార్డ్‌ను పోలింగ్ కేంద్రానికి తీసుకురాలేకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఐడెంటిటీ వెరిఫై చేసుకునే విషయంలో ఎన్నికల సంఘం ఓటర్లకు కొన్ని సడలింపులు ఇచ్చింది. ఓటర్ ఐడీ కార్డ్ లేకపోతే, దానికి బదులుగా ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటి కొన్ని గుర్తింపు కార్డులలో దేనినైనా ఉపయోగించి ఓటు వేయవచ్చు. ఏయే డాక్యుమెంట్స్ పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లవచ్చో తెలుసుకుందాం. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళేటపుడు ఎపిక్ కార్డు లేని వారు 13 రకాల కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు.

1) ఓటర్ గుర్తింపు కార్డు
2) ఆధార్ కార్డు
3) ఎం.ఎన్.ఆర్.ఇ. జి.ఏ.జాబ్ కార్డు
4) ఫోటోతో ఉన్న బ్యాంక్/పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్
5) కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు
6) డ్రైవింగ్ లైసెన్స్
7) పాన్ కార్డ్
8) కార్మిక మంత్రిత్వ శాఖ పథకం ద్వారా జారీచేసిన స్మార్ట్ కార్డు
9) పాస్‌పోర్ట్
10) ఫోటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్
11) కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు
12) ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు
13) యూనిక్ డిసేబిలిటీ గుర్తింపు కార్డు

పైన సూచించిన 13 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదానిని చూపించి ఓటు వేయవచ్చని ఆయన సూచించారు. మే 13వ తేదీన జిల్లాలోని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని.. ఓటింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు.

అంబేద్కర్ వారసురాలిగా వస్తున్నా.. ఆశీర్వదించండి

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఉండటం వల్లే కోచ్ ఫ్యాక్టరీ కల సాకారం కాలేదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, కేంద్రంలోనూ తమ పార్టీనే అధికారంలోకి వస్తున్న నేపథ్యంలో తాను గెలిస్తే తప్పకుండా కోచ్ ఫ్యాక్టరీ సాధిస్తానన్నారు. మామునూరులో ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణకు కృషి చేస్తానన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ సిటీ, మహిళల ఆరోగ్యం, యువతకు ఉపాధికి కావాల్సిన ప్రాజెక్టులు తీసుకువస్తానని ధీమా వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రస్థానం గురించి కడియం కావ్య మాటల్లోనే

సేవ చేయడానికే రాజకీయాల్లోకి..

డాక్టర్గా , కడియం ఫౌండేషన్ ద్వారా చేసే సేవ కంటే మరింత ఎక్కువ ప్రజలకు హెల్ప్ చేసే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చా. గత పదేండ్లలో పేద బాలికలు, మహిళలు, ప్రతిభ కలిగిన విద్యార్థుల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించా. ఇలాంటి సేవలు అందించడానికి ప్రభుత్వం ద్వారా ఎన్నో స్కీంలు ఉంటాయనే విషయం నాన్న కడియం శ్రీహరి మంత్రి అయ్యాక తెలిసింది. అప్పటి వరకు నేను వ్యక్తిగతంగా వేల మందికి సేవ చేస్తే రాజకీయాల ద్వారా లక్షలాది మందికి సర్వీస్ అందించాలని భావించా.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇండస్ట్రియల్‌కారిడర్కు ప్రయారిటీ..

నా చిన్నప్పటి నుంచి సిటీలో కాలనీల్లోకి వరద నీరు వస్తోంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం లేకపోవడంతో సమస్య తీవ్రత పెరుగుతోంది. అందుకే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రయారిటీ ఇస్తా. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సైతం హామీ ఇచ్చారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు ఇండస్ట్రియల్ కారిడార్ చేపడతాం. ఐటీ హబ్, మెగాటెక్స్ టైల్ పార్క్ అభివృద్ధితో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా. రెండో రాజధానిగా ఉన్న వరంగల్‌లో నీటి వనరులు, ఖనిజ సంపద, బొగ్గు గనులు, విద్యుత్ కంద్రాలు, యూనివర్సిటీలు, మెడికల్ కాలేజీలు, స్మార్ట్ సిటీ, టూరిస్ట్ స్పాట్‌లైన ఖిలా వరంగల్, వెయ్యి స్తంభాల గుడి ఇలా ఎన్నో ఉన్నయ్. నేను ఎంపీగా గెలిస్తే ఎమ్మెల్యేల సహకారంతో వరంగల్‌ను డెవలప్ చేస్తా.

డాక్టర్ కల్పనా దేవి తర్వాత ఆ అవకాశం నాకే

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతంలో అప్పుడెప్పుడో డాక్టర్గా కల్పనా దేవి ఎంపీ అయ్యారు. ఇన్నాళ్ల తర్వాత అలాంటి అవకాశం నాకే వచ్చింది. నాన్న కడియం శ్రీహరి ఇచ్చిన ప్రోత్సాహంతో బీఆర్ అంబేద్కర్ వారసులిగా రాజకీయాల్లోకి వస్తున్నా. సెక్యులరిస్ట్‌గా ఉండే నన్ను ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నా. కలిసి దందా చేసుకునేటోళ్లే.. నాపై పోటీ చేస్తున్రు లోక్‌సభ ఎన్నికల్లో నాపై పోటీ చేసేటోళ్లు మన్నుతిన్న పాములెక్క పడుకుని ఒకరికొకరు సపోర్ట్ చేసుకుంటున్రు. మనోడు ఎలాగూ గెల్వడని బీఆర్ఎస్ వాళ్లు బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేశ్ కోసం పనిచేస్తున్నరు. ఇప్పుడు మిగిలిన ఆరు నియోజకవర్గాలను కలిసి దోచుకుందామన్న ఉద్దేశంతో అరూరికి బీఆర్ఎస్ నాయకులు సపోర్ట్ చేస్తున్రు. బీజేపీ నాపై గెల్వలేక వ్యక్తిగత ఆరోపణలు, దూషణలకు దిగుతోంది.

యూత్, మహిళల కోసం.. నాకంటూ ఓ మేనిఫెస్టో

వరంగల్ అభివృద్ధి కోసం ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులు తీసుకురావడం అనేది నాతో పాటు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ డ్రీమ్. వీటితో సంబంధం లేకుండా నాకంటూ ఓ మేనిఫెస్టో ఉంది. డాక్టర్‌గా, కడియం ఫౌండేషన్ తరఫున ఎందరో పేద బాలికలు, రక్తహీనతతో బాధ పడ్తున్న మహిళలు, ప్రతిభ ఉండి పై చదువులకు వెళ్లలేని విద్యార్థులు, అనాథలకు ఎంతో సేవ చేసిన నేను.. ఇప్పుడు దాని ఫలాలు ఎక్కువ మందికి చేరేలా చూస్తాను. యువ న్యాయం పేరుతో ఉన్న ప్రాజెక్టుతో ఎక్కువ మంది యూత్‌కు ఉపాధి కల్పిస్తా.